ప్రతికూల వాతావరణం..
విమానాల మళ్లింపు

శంషాబాద్: భారీ వర్షం.. ప్రతికూల వాతావరణం కారణంగా శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాల్సిన పలు విమానాలను దారి మళ్లించారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు కురిసిన భారీ వర్షంతో రాంచి నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి బయలుదేరిన ఐఎక్స్–2674 విమానం మధ్యాహ్నం 3.35 గంటలకు ల్యాండ్ కావాల్సి ఉంది. అయితే ఇక్కడి వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఏటీసీ దానిని విజవాడ విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు తెలిపాయి. అదే విధంగా గోవా నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి బయలుదేరిన ఇండిగో 6ఈ–117 విమానం విమానాన్ని కూడా రాత్రి 7 గంటల సమయంలో విజయవాడకు మళ్లించారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా–2519 విమానం కూడా ప్రతికూల వాతావరణం కారణంగా బెంగళూరుకు మళ్లించారు. వర్షం కారణంగా విమానాల రాకపోకలకు సంబంధించి సంబంధిత ఎయిర్‌లైన్స్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుని ప్రయాణాన్ని సులభతరం చేసుకోవాలని ఎయిర్‌పోర్టు వర్గాలు ఓ ప్రకటనలో సూచించాయి.

విద్యార్థులకు అవగాహన



శంషాబాద్: శంషాబాద్ మండలం మల్కారం గ్రామంలో సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో సమావేశమై వినియోగదారుల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. రైతులకు వివిధ రకాల సేద్య పద్ధతులను తెలియజేశారు. పెద్ద సంఖ్యలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నల్లపోచమ్మకు ప్రత్యేక పూజలు



హోమంలో పాల్గొన్న శ్రీలతసురేష్‌గౌడ్ దంపతులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మండల పూజ, అభిషేకం, చండీ హోమం, అన్నప్రసాద కార్యక్రమాలను నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేష్‌గౌడ్ దంపతులు హోమంలో పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పరిశుభ్రతపై అవగాహన



డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇళ్లల్లో ఉత్పన్నం అయ్యే చెత్త ఇతర వ్యర్థాలను రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో వేయవద్దు అని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. శుక్రవారం 1వ డివిజన్‌లోని శివసాయినగర్ కాలనీలో తడి, పొడి చెత్త, హానికర చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. 2వ డివిజన్‌లోని గాయత్రీనగర్ కాలనీలో అండర్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ ఆదర్శ్‌కుమార్‌పాల్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

మైలార్‌దేవ్‌పల్లి: బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడికే రాజు తెలిపారు. లక్ష్మీగూడలోని పోచమ్మ దేవాలయం వద్ద బోనాల ఏర్పాట్లు భారీ స్థాయిలో చేపట్టామన్నారు. ఈ నెల 20వ తేదీన భక్తులు తమ బోనాలను తీసుకువచ్చి అమ్మవారికి నైవేత్యంగా సమర్పించాలని కోరారు. తొట్టెల ఊరేగింపు, బోనాల ర్యాలీలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు నర్సింగ్, రాధాకృష్ణ, బాబురావు, వీరేష్, దుర్గేష్, యాదయ్య, ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇళ్లు, అపార్ట్‌మెంట్ సెల్లార్లలోకి చేరిన నీరు
- ఇబ్బందులకు గురైన ప్రజలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి కురిసిన భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షం.. వరద పోటెత్తిన నేపథ్యంలో జనజీవనం స్తంభించింది. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత బస్తీలలో వరదనీరు ఏరులై పారింది. పలు ప్రాంతాల్లోని సెల్లాల్లు, ఇళ్లను వరదనీరు ముంచెత్తింది. ప్రధాన రహదారులపై వరదనీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్లపై నీరు నిలిచిన నీటిని తొలగించేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

☛ రాజేంద్రనగర్, ఉప్పర్‌పల్లి, అత్తాపూర్, హైదర్‌గూడ జనప్రియ, శివరాంపల్లి బెస్ట్ ప్రైజ్, ఆరాంఘర్, మైలార్‌దేవ్‌పల్లి, బుద్వేల్ అండర్ గ్రౌండ్ బ్రిడ్జి, కాటేదాన్ కర్నూల్ రోడ్డు, శంషాబాద్ రైల్వే బ్రిడ్జి రోడ్డు, బండ్లగూడ సన్ సిటీ రోడ్డు, మణికొండ, నార్సింగి ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపై వరదనీరు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



బండ్లగూడ ఇందిరమ్మ కాలనీలో రోడ్డులో నిలిచిన నీటిని తొలగిస్తున్న స్థానికులు

☛ మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ కాలనీలోని పలు సెల్లార్లలోకి, ఇళ్లల్లోకి వరదనీరు రావడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

☛ బండ్లగూడ ఇందిరమ్మ కాలనీ, వినాయక్‌నగర్, శ్రీకృష్ణ కాలనీ, ఒయాసిస్ అపార్ట్‌మెంట్, శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీ ప్రాంతాల్లో వరదనీరు ఇళ్ల ముందు నిలిచిపోవడంతో ఇబ్బందులకు గురయ్యారు.

☛ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో వరదనీటిని తొలగించేందుకు మాన్‌సూన్ టీమ్‌తో పాటు ఐదు మొబైల్ బృందాలను అధికారులు ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రానికి ఈ టీమ్‌లు సర్కిల్ పరిధిలోని 14 ప్రాంతాల్లో నిలిచిపోయిన వరదనీటిని తొలగించారు.



రాజేంద్రనగర్ బాలాజీ మంగళం హోటల్ వద్ద నదిని తలపిస్తున్న రోడ్డు

అప్రమత్తంగా ఉండండి

అత్తాపూర్: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అవసరమైతే తప్ప బయటకు రావద్దని అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటికొచ్చినా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వరద నీరు వెళ్లేందుకు జీహెచ్‌ఎంసీ సిబ్బంది మ్యాన్‌హోల్స్ తెరిచే అవకాశం ఉంటుందన్నారు. పిల్లలు, వృద్ధులు బయటికి వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపై ఉందన్నారు.



బండ్లగూడ కాలనీలో రోడ్డు దుస్థితి



అలకాపూర్‌లోని ఇళ్లల్లోకి చేరిన వరదనీరు



అపార్ట్‌మెంట్‌లోకి చేరిన వరదనీరు

పొంగి ప్రవహిస్తున్న వాగులు

- భూగర్భ జలాల వృద్ధికి దోహదం
- రైతుల్లో హర్షాతిరేకం
- పలు ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసం

శంషాబాద్ రూరల్: శంషాబాద్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. వరద నీటితో రోడ్లు ధ్వంసం కాగా.. ఇళ్లు, దుకాణాల్లోకి వరదనీరు చేరింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. పెద్దషాపూర్‌లో 109.3 మిల్లీమీటర్లు, శంషాబాద్ పట్టణంలో 22.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వర్షం ఈ ఏడాదిలో అత్యధికంగా కురిసిన వానగా రికార్డు సృష్టించింది. మరోవైపు సుమారు నెల రోజుల తర్వాత భారీ వాన కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చౌదరిగూడ శివారులోని ఇంద్రారెడ్డి కాలనీలోకి వరద నీరు పోటెత్తడంతో రోడ్డు ధ్వంసమైంది. ఇళ్లలోకి వరదనీరు చేరింది. రాయన్నగూడ చౌరస్తాలో వరదనీటి కాలువను మూసి వేయడంతో నీరంతా దుకాణాల్లోకి చేరగా.. ఇక్కడి రహదారిపై నీరు నిలిచిపోయింది. రామంజాపూర్ పాఠశాల ఆవరణలో వరదనీరు చేరి చెరువును తలపించింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈసీ, ఎంటేరువాగుల్లో వరద పారింది. సుల్తాన్‌పల్లి–కేబీ దొడ్డి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ననాజీపూర్ కత్వ నుంచి వరదనీరు పారడంతో జలపాత దృశ్యాలను చూసేందుకు జనం తరలివచ్చారు.



మండలంలోని రామంజాపూర్ పాఠశాల ఆవరణలో నిలిచిన వరదనీరు



పిల్లోనిగూడ వద్ద ఎంటేరువాగులో పారుతున్న వరద



కవేలిగూడలో దుకాణంలోకి చేరిన వరదనీరు



మండలంలోని ననాజీపూర్ కత్వ నుంచి పారుతున్న వరదనీరు

వరదనీటిలో చిక్కుకున్న బస్సు

- సత్వరమే స్పందించిన రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు
- చాకచక్యంగా బయటకు తీసుకొచ్చిన వైనం
- ప్రయాణికులు సురక్షితం

రాజేంద్రనగర్: ప్రయాణికులతో వరదనీటిలో చిక్కుకున్న ఆర్టీసీ బస్సును రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు చాకచాక్యంగా వ్యవహరించి బయటికి తీసుకొచ్చారు. దీంతో ప్రయాణికులంతా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరారు. శుక్రవారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో రాజేంద్రనగర్‌లో భారీ వర్షం కురిసింది. అంతకుముందే కురిసిన వర్షానికి వరదనీరంతా రోడ్లపైకి చేరింది. శివరాంపల్లి నుంచి ఆరాంఘర్‌కు వెళ్లే ప్రధాన రహదారి ప్రజా భవన్ వద్ద వరదనీరు పూర్తిగా నిలిచిపోయింది. ఈ సమయంలో రాజేంద్రనగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బహదూర్‌పురా నుంచి శంషాబాద్ వైపు వెళుతూ వరదనీటిలో చిక్కుకుంది. వరదనీటిలో పూర్తిగా చిక్కుకున్న ఈ బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. వరదనీటిలో వెళుతూ ఒక్కసారిగా వాహనం నిలిచిపోయింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా ముందుకు కదలకపోవడంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపాడు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజు ఈ విషయాన్ని తెలుసుకొని తన సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. మరమ్మతులు చేసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాకపోవడంతో ట్రాఫిక్ లిఫ్ట్ వాహనాన్ని తెచ్చి బస్సును ఆరాంఘర్ వైపు తీసుకొచ్చారు. దీంతో ప్రయాణికులంతా సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరారు. పలువురు ప్రయాణికులు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులను అభినందించారు.



శివరాంపల్లి రోడ్డుపై వరదనీటిలో ఆగిన బస్సుకు మరమ్మతు చేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

మదిదోచే చేనేత వస్త్ర ప్రదర్శన

మణికొండ: దేశ వ్యాప్తంగా చేతి వృత్తుల వారు తయారు చేసిన దుస్తులు, గృహోపకరణ వస్తువుల అల్ ఇండియా హ్యాండ్లూమ్స్, హ్యాండీక్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌కు సందర్శకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. మణికొండ పైప్‌లైన్ రోడ్డులోని సుందర్ గార్డన్ ఫంక్షన్ హాల్‌లో ఈ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఇందులో మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, డిజైనర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్ ప్రింటెడ్ లెనిన్, కలంకారి, బెంగాల్ కాటన్ చీరలతో పాటు డ్రస్ మెటీరియల్, డిజైనర్ బ్లౌస్‌లు, ఖాదీ మెటీరియల్, వన్ గ్రాం గోల్డ్ జ్యువలరీ, జైపూర్ బెడ్‌షీట్, కొండపల్లి బొమ్మలు, పర్సులు, గృహోపకరణ వస్తువులు, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువలరీ అందుబాటులో ఉన్నాయి. అనేక రాష్ట్రాలలో చేతి వృత్తి కళాకారులు తయారు చేసిన వస్తువులన్నీ ఒకే చోట మంచి నాణ్యత, సరసమైన ధరల్లో లభిస్తుండటంతో కొనుగోలు దారులు ఆదరిస్తున్నారని నిర్వాహకుడు అక్బర్ తెలిపారు. కొన్ని రోజులు మాత్రమే ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని మణికొండ మున్సిపాలిటీ పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



చేనేత వస్త్రాలను కొనుగోలు చేస్తున్న మహిళ

నిబంధనల మేరకే చెరువును అభివృద్ధి చేయాలి



చెరువు వద్ద జరుగుతున్న పనులపై ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

హెచ్‌ఎండీఏ అదనపు కమిషనర్ శ్రీవాస్తవ

మణికొండ: చెరువు విస్తీర్ణాన్ని తగ్గించటం, అందులోకి మురుగునీరు కలపటం లాంటి పనులకు ఎట్టి పరిస్థితిలోను అనుమతించమని హెచ్‌ఎండీఏ అదనపు కమిషనర్ శ్రీ వాస్తవ అన్నారు. శుక్రవారం ఆయన మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల మధ్యలో మై హోం అవతార్ సమీపంలో ఉన్న ముష్కి చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులు చెరువుకు వరద రూపంలో వచ్చే కాలువలోకి మురుగునీటి కాలువను మళ్లించటంతో చెరువు దుర్గంధంగా మారుతున్నదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. చెరువు విస్తీర్ణాన్ని తగ్గించేలా కొత్తగా కట్ట ఏర్పాటు చేయటంతో భవిష్యత్తులో భూ కబ్జాలకు అవకాశం కల్పిస్తుందన్నారు. చెరువు అభివృద్ధి సంగతి ఎలా ఉన్నా ప్రస్తుతం కొనసాగుతున్న పనులు చేస్తే రాబోయే రోజుల్లో చుట్టుపక్కల నివసించే ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. దానికి స్పందించిన ఆయన చెరువు అభివృద్ధికి సీఎస్‌ఆర్ పథకంలో నిధులను సమకూర్చుతున్న తత్త్వ సంస్థ ప్రతినిధులను చెరువు వద్ద జరుగుతున్న తప్పులను వెంటనే సరిచేయాలని, మణికొండ మున్సిపాలిటీ, ఇరిగేషన్ శాఖల అధికారుల సూచనలతో మురుగునీటి మళ్లింపు విషయాన్ని ఆలోచన చేయాలన్నారు. హెచ్‌ఎండీఏతో ఉన్న ఒప్పందం ప్రకారమే చెరువు వద్ద అభివృద్ధి పనులు చేయాలన్నారు. ఆయా శాఖల అధికారులు వారికి సహకరించాలని ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో స్థానికుల ప్రతినిధి గౌతంరెడ్డితో పాటు నివాసితులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా శనివారం కాటేదాన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 11 నుంచి 11.30 వరకు దుర్గానగర్ ఫీడర్‌లోని దుర్గానగర్, దుర్గాహిల్స్, టీఎన్‌జీవోస్ కాలనీ, అయ్యప్ప స్వామి దేవాలయం, మైలార్‌దేవ్‌పల్లి కల్లు కంపౌండ్, శాంతినగర్, గణేష్‌నగర్, స్వప్న థియేటర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని వివరించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

అత్తాపూర్: అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వెరిజాన్ డాటా సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైటెక్‌సిటీ మైండ్ స్పేస్ సహకారంతో సీఆర్‌ఎస్ ఫండ్‌తో స్టీమ్ (సైన్స్ టెక్నాలజీ ఇంజనీరింగ్ మెథమెటిక్స్) ల్యాబ్‌లో 6వ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత పాల్గొన్నారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లతో పాటు స్టేషనరీ సామగ్రిని అందజేశారు. వెరీ జాన్ సర్వీసెస్ ప్రతినిధులు పంకజ్ సింగ్, వెంకటరఘురామ్, సంతోష్, విశ్వనాథ్, సందీప్, దానిష్, ఉపాధ్యాయులు సాయిప్రసాద్‌రావు, రోజారాణి, శ్రీనివాససాగర్, సురేష్, హాసిని తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



ఆనంద్‌రెడ్డి (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన వెలుగుచూసింది. పోలీసుల సమాచారం మేరకు... కాటేదాన్ టీఎన్‌జీవోస్ కాలనీలో ఆనంద్‌రెడ్డి(41) తన కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వీడాలి: బీఆర్‌ఎస్

మణికొండ: మున్సిపాలిటీలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించటంలో కమిషనర్ చొరవ చూపరు.. ప్రత్యేకాధికారికైనా చెప్పుకుందామంటే ఆయన కనిపించరు.. ఎన్నిసార్లు సమస్యలను వివరించినా అధికార యంత్రాంగం పట్టించుకోవటం లేదని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మణికొండ మున్సిపల్ కార్యాలయం ముందు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు అనేక సమస్యలతో సతమవుతున్నారని, వాటిని ఎప్పటికపుడు మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవటం లేదన్నారు. పాలకవర్గం పదవీ కాలం అయిపోయినా వారు చెప్పినట్టే కమిషనర్ విని పనులను చేపడుతున్నారు తప్ప ప్రజలకు ఉపయోగపడే పనులను చేయటం లేదని ఆరోపించారు. పుప్పాలగూడలో అంబేడ్కర్ భవన నిర్మాణం, శ్మశాన వాటిక దారి ఆక్రమణ, వీధి కుక్కలు, అద్వానంగా రోడ్లు, అధ్వానంగా మురుగునీటి వ్యవస్థ, ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా వారి పద్ధతి మార్చుకుని ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ విషయాలపై మున్సిపల్ మేనేజర్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధన్‌రాజ్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, ప్రచార కార్యదర్శి ఉపేంద్రనాథ్‌రెడ్డి, నాయకులు మాల్యాద్రినాయుడు, షేక్ ఆరీఫ్, శ్రీకాంత్, బాబురావు, భానుచందర్, సుమ నళిని, బాబు, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నేతలు

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



స్థానికులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మోహన్‌రెడ్డి నగర్‌లో జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. సీసీ రోడ్డు పనులకు నూతన ఎస్టిమేషన్‌లు వేసి వీలైనంత త్వరగా పనులను ప్రారంభించేలా చూడాలని సూచించాచారు. భూగర్భ డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థ దెబ్బతినడంతో నూతన పైపులైన్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. బోనాల పండుగను దృష్టిలో ఉంచుకొని అమ్మవారి ఆలయ పరిసరాల్లో రోడ్ల ప్యాచ్‌వర్క్ పనులు, మరమ్మతులు చేపట్టి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలని వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి సూపర్‌వైజర్ లోక్‌నాథ్, నేతలు నర్సింహ, సంతు గౌడ్, కురుమూర్తి, రోహిత్, అశోక్, రాహుల్, నాని, బబ్లూ, ఎ.శంకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్, రాజు, నటరాజ్, లక్ష్మణ్, విష్ణు, బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- మ్యాన్‌హోళ్ల పరిస్థితి అధ్వానం
- ప్రజలకు తప్పని మురుగు సమస్య

శాస్త్రిపురం: మురుగునీటి పైప్‌లైన్లు సరిపోకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ పైప్‌లైన్లు సరిపోకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించే పరిస్థితి నెలకొంది. దాదాపు 15 సంవత్సరాల క్రితం నిర్మించిన పైప్‌లైన్లు కావడంతో తరచూ బస్తీలలో మురుగునీటి సమస్యలు తలెత్తున్నాయి. శాస్త్రిపురం, సులేమాన్ నగర్ డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో నిత్యం ప్రలు మురుగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఇళ్ల సంఖ్య పెరిగిపోవడం, కాలనీలు, బస్తీలు పెరగడంతో మురుగునీటి కోసం నిర్మించిన పైప్‌లైన్‌లు సరిపోవడం లేదు. నిత్యం బస్తీలలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది డ్రైనేజీలను పూడిక తీయాలిన పరిస్థితులు ఉంటున్నాయి. చాలా రోజులుగా ప్రజలు తమ కాలనీలలో మురుగునీటికి సరిపడా పైప్‌లైన్లు లేవని డ్రైనేజీ లైన్లను మార్చాలని చెప్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. నూతన లైన్ల ఏర్పాటుపై చర్యలూ తీసుకోవడం లేదు. శాస్త్రిపురం, హాజన్‌నగర్, ఎంఎం పహడీ, నౌనంబర్, సులేమాన్ నగర్‌లలో మురుగునీటి సమస ఎక్కువగా ఉంటుంది. డ్రైనేజీలైన్లకు మరమ్మతులే కాకుండా అవసరం ఉన్న చోట పెద్ద పరిమాణంలో పైప్‌లైన్లు నిర్మించాలని ప్రజలు కోరుతన్నారు.



శాస్త్రిపురం రహదారిపై మురుగునీరు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు